క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

శ్రీకాకుళం కల్చరల్: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సాహుకారి అన్నపూర్ణమ్మ వర్ధంతి పురస్కరించుకొని ఆమె కుమారుడు సాహుకారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. అలాగే అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అన్నదానం, పండ్ల పంపిణీ, ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు కళ్లద్దాల పంపిణీ చేపట్టారు. రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ అన్వేష్, స్వాతి, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, రాయితీ చంద్రశేఖర్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరీకి అరసం మద్దతు

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి అభ్యుదయ రచయితల సంఘం తరుపున శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు సోమవారం ఒక ప్రకటనలో మద్దతు ప్రకటించారు. మేధావులంతా ఉద్యమ కుటుంబానికి చెందిన ఆమెను గెలిపించాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామ పంచాయతీలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. కాలువలు శుభ్రం చేసి చెత్త తొలగించారు. చెత్త పోగులను డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం ప్రజలకు పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. పనులను సర్పంచ్ తండ్యాన జయలక్ష్మి, సెక్రటరీ బోర రమణయ్య పర్యవేక్షించారు.

దోమల మందు పిచికారీ



సాక్షి ఎఫెక్ట్...

దోమల మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈనెల 24వ తేదీన సాక్షి పత్రికలో 'చెరువు కాదు స్థలమే' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు సోమవారం దోమల మందు పిచికారీ చేశారు. దీంతో చుట్టుపక్కలవారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఖాళీస్థల యజమానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

చికెన్ మేళా



చికెన్ మేళా ప్రారంభిస్తున్న ఎంపీటీసీ జగన్నాథం

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం - మెట్టవలస కూడలి వద్ద సోమవారం సాయంత్రం వెన్‌కాబ్, కుసుమ పౌల్ట్రీ ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. ఇటీవల జిల్లాలో బర్డ్ ఫ్లూ భయాందోళన నెలకొనడంతో చికెన్ కొనుగోళ్లు దెబ్బతిన్నాయి. దీంతో చికెన్ తినడం వలన ఎటువంటి ప్రమాదం లేదని నిరూపించడానికి మేళా నిర్వహించినట్లు మెట్టవలస ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథం తెలిపారు. కార్యక్రమంలో బెవర బాలకృష్ణ, జడ్డు అప్పలసూరి, ముళ్ల ఉమ, టంకాల వేణు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

తప్పని ట్రాఫిక్ తిప్పలు



భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

రణస్థలం: పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా మట్టి నమూన పరీక్షలు చేస్తూ వన్‌వే ట్రాఫిక్‌ను హైవే అధికారులు వదులుతున్నారు. పాత పోలీస్‌స్టేషన్ దగ్గర ఒకవైపు ఫ్లై వంతెన పనులు, మరోవైపు ప్రయాణికులు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో ప్రయాణికులను ఎక్కించేందుకు బస్సు ఒక నిమిషం ఆగితే వెనుక వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఒక్కోసారి వాహనదారులు అర్ధ గంటకు పైగా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో బస్సులు సర్వీస్ రోడ్డులో వెళ్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని స్థానికులు భావిస్తున్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రణస్థలం: మండల కేంద్రంలోని దన్నానపేట కూడలి వద్ద పాతర్లపల్లి గ్రామానికి చెందిన గొర్లె సత్యం ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో సత్యం కాలువిరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై బాధితుడు సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జే.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కాలువ ఇలా.. సాగు ఎలా..?

- పిచ్చి మొక్కలతో నిండిన తోటపల్లి కాలువ
- పూర్తికాని పిల్ల కాలువల నిర్మాణాలు
- శివారు గ్రామాలకు అందని సాగునీరు



కొండములగాం వద్ద మొక్కలతో నిండిపోయిన తోటపల్లి కాలువ

రణస్థలం:

తోటపల్లి కాలువ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో తోటపల్లి కాలువ పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అలాగే పిల్ల కాలువలకు భూసేకరణ పూర్తికాకపోవడంతో శివారు గ్రామాలకు సాగునీరు అందడం లేదు. రణస్థలం మండలంలో 21.590 హెక్టార్లు, లావేరులో 11.008 హెక్టార్లు, జి.సిగడాంలో 6.373 హెక్టార్లకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేలా కాలువలు రూపొందించారు. అయితే కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో సాగునీరు అన్నదాతకు అందని ద్రాక్షలా మారింది.

గతేడాది ఇబ్బందులు

గతేడాది సాగునీరు సకాలంలో అందకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవరాపల్లి, వెల్పురాయి, కమ్మసిగడాం, బంటుపల్లి వరకు మాత్రమే సాగునీరు అరకొరగా వచ్చి ఆగిపోయింది. వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పాటు తోటపల్లి సాగునీరు రాకపోవడంతో వరి పొలాలు ఎండిపోయిన పరిస్థితి ఏర్పడింది. దేరసాం, కోష్ట, తెప్పలవలస, తామాడ వైపు పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో రణస్థలం మండలానికి కరువు తాండవించింది. ఈ ఏడాది శ్రీకాకుళం బ్రాంచి కాలువలో పనికిరాని మొక్కలు పెరిగిపోవడం వలన సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.

ఊకదంపుడు ఉపన్యాసాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తోటపల్లి కాలువ ద్వారా శివారు గ్రామాలకు సాగునీరు అందించడమే తమ ధ్యేయమని నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. కానీ రైతులకు మేలు జరిగే చర్యలు తీసుకోలేదు. రణస్థలం మండలంలోని పైడిభీమవరం, దేరసాం, తెప్పలవలస, లావేరు మండలంలోని బెజ్జిపురం, గురుగుబిల్లి, తామాడ వంటి గ్రామాలకు పిల్ల కాలువలు తవ్వాల్సి ఉన్నా ఆదిశగా ఎటువంటి ప్రయత్నాలు జరపలేదు. ఇదే పరిస్థితి మరో రెండు నెలలు కొనసాగితే వచ్చే ఖరీఫ్‌కు రైతన్నలు ఇబ్బందులు పడడం ఖాయమని చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు చొరవ తీసుకుని తోటపల్లి కాలువ పూడిక తీతలు, పిల్ల కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సాగునీరు అందించాలి

తోటపల్లి కాలువలో ఎక్కడిక్కడే పనికిరాని మొక్కలు పెరిగిపోవడం వలన సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. అధికారులు త్వరగా స్పందించి కాలువలో పూడికతీత పనులు చేపట్టాలి. అలాగే పిల్ల కాలువలు పూర్తి చేయాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఈసారి సాగు చేపట్టే పరిస్థితి ఉండదు.

– గొర్లె అప్పలనాయుడు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, కొండములగాం

పనులు ప్రారంభిస్తున్నాం

తోటపల్లి కాలువ నిర్వహణ పనులకు రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయి. శ్రీకాకుళం బ్రాంచి కెనాల్ చీపురుపల్లి సమీపంలో పూడిక తీత పనులు ప్రారంభించాము. త్వరలో చివరి కెనాల్ వరకు పూర్తిస్థాయిలో పనులు చేపడతాం. పిల్ల కాలువలు తీసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు ప్రతిపాదనలు పంపించాం. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం

– కె.లావణ్య, డీఈఈ, తోటపల్లి ప్రాజెక్టు

వృద్ధులకు భోజనాలు



శ్రీకాకుళం నగరంలోని ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వమరవిల్లి మాజీ సర్పంచ్ సుగ్గు లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా కుమారుడు సుగ్గు మధురెడ్డి సోమవారం భోజన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా మధురెడ్డి మాట్లాడుతూ.. ఆమె బ్రతికున్నంతకాలం అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది కోత తిరుమలరావు, కె.వేణుగోపాల్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, ప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు కోట సావిత్రమ్మ, శక్తి అధ్యక్షురాలు పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆశాజనకంగా మామిడిపూత



మామిడి, జీడి తోటల్లో ఈ ఏడాది పూత ఆశాజనకంగా ఉంది. దీంతో లాభాలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. జి.సిగడాం మండలంలోని పున్నాం, ఎందువ, బాతువ, ఉల్లివలస, డీఆర్‌వలస, నడిమివలస, ఎస్‌పీ ఆర్‌పురం తదితర గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకుపైగా జీడి, మామిడి తోటలు ఉన్నాయి. అయితే మంచు, తెగుళ్లు రైతులను భయపెడుతున్నాయి. ఉద్యానవనశాఖ అధికారులు సకాలంలో స్పందించి పూతను పరిరక్షించేందుకు తగిన సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

– జి.సిగడాం

మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు (లక్ష్మణరావు) సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు బీసీ సాధికారత చైర్మన్, కడప ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఉన్నారు.

– శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ)

లే ఆఫ్ నోటీసు ఉపసంహరించుకోవాలి



రెవెన్యూ అధికారి శ్రావణికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

రణస్థలం: శ్యాం పిస్టన్స్ పరిశ్రమలో అక్రమ లే ఆఫ్ నోటీసును యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఇవ్వాల్సిన చెల్లింపులు వెంటనే చేయాలన్నారు. యాజమాన్యం 200 మంది కార్మికులను మార్చి 1వ తేదీ నుంచి లే ఆఫ్ చేసేందుకు ప్రభుత్వానికి అనుమతి కోరుతూ దరఖాస్తు చేసిందన్నారు. దీని వలన తమను పనిలో నుంచి తొలగిస్తారని కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన లే ఆఫ్ అమలు చేయవద్దని యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తైన కార్మికులను బలవంతంగా రిటైర్మెంట్ చేస్తున్నారని, ఇప్పటివరకు అక్రమంగా 80 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ ద్వారా తొలగించారన్నారు. దీంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నాయని వాపోయారు. దీనిని నిరసిస్తూ మార్చి 3వ తేదీన ఛలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు ప్రకటించారు. అనంతరం రెవెన్యూ అధికారి శ్రావణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, గొర్లె కిరణ్, నాయకులు వెలమల రమణ, ఆర్.ఎస్.నాయుడు, కె.భోగీష్, ఎన్.నాగేశ్వరరావు, గురు ఈశ్వరరావు, గొర్లె కృష్ణ, వి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులు పట్టివేత



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు సంత నుంచి జాతీయ రహదారిపై విజయనగరానికి అక్రమంగా తరలిస్తున్న పశువులను లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు సోమవారం పట్టుకున్నారు. బుడుమూరు సంత నుంచి రణస్థలం వైపు వెళ్తున్న బొలెరో వ్యానులో ఈ పశువులను తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. మొత్తం 13 ఆవులను రణస్థలం మండలంలోని కోష్ట గ్రామం వద్దనున్న గో సంరక్షణ శాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జంగివలసకు చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

అక్షయ పాత్ర వంటశాల పరిశీలన



అక్షయ పాత్ర ఫౌండేషన్‌లో భోజనాలు పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. మండల పరిధిలోని సింగుపురంలో గల అక్షయ పాత్ర వంటశాలను ఆయన సోమవారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని పాఠశాలలకు అక్షయ పాత్ర ద్వారా భోజనాలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. భోజనాల గురించి సమస్యలు ఉంటే చెప్పుకునేలా ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 309 పాఠశాలలకు, 5 కళాశాలలకు భోజనాలు అందిస్తున్నట్లు అక్షయ పాత్ర సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, అక్షయ పాత్ర మేనేజర్ పి.వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి అనుకోని కింతలిమిల్లు సమీపంలోని లక్ష్మీడిపేట గ్రామంలో ఉన్న కోదండరామస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రత్యేక పూజలు ఈనెల 20వ తేదీన ప్రారంభమవ్వగా, బుధవారం వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంటిచూపు కాపాడుకోవాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్: ప్రతి ఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని, ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచిత నేత్రవైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పలు స్టేషన్లలో పనిచేస్తున్న కానిస్టేబుల్స్‌తో పాటు ఎస్పీ కార్యాలయం, డీసీఆర్బీ, ఎస్‌బీ, ఇతర విభాగాల మినిస్టీరియల్ సిబ్బంది 175 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సీఎస్ఆర్ మేనేజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షితకు అభినందనలు



హర్షితను అభినందిస్తున్న వర్సిటీ వీసీ రజిని తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరుపున ఈనెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన అఖిల భారత వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో శ్రీకాకుళం పట్టణంలోని శారదా డిగ్రీ కళాశాలలో చదువుతున్న గుజ్జుల హర్షిత పాల్గొంది. ఈ పోటీలు హిమాచల్‌ప్రదేశ్‌లో ధర్మశాలలోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించారు. 64 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో వర్షిత రజిత పతకం సాధించింది. దీంతో విద్యార్థినిని వర్సిటీలో వీసీ కె.ఆర్.రజినితో పాటు ఇతర అధికారులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రశ్నిస్తారనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదు



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం భయపడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా ఇస్తే ఎన్నికల హామీల అమలుపై నిలదీస్తారనే భయం సీఎం చంద్రబాబుకు పట్టుకుందన్నారు. హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏబీవీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

విద్యార్థులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ బోర గోపి అన్నారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల మధ్యాహ్న భోజన సదుపాయాలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఆఫీస్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, గురజాపు మహేష్, బాలకృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. యువత లక్ష్య సాధనవైపు అడుగులు వేయాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌పాత్రో, ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ యూనియన్ నాయకులు

ఎచ్చెర్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ యూనియన్ నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా లావేరు మండలంలోని వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో పీఆర్టీయూ నాయకులు సోమవారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, మండల అధ్యక్షుడు నీలంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



గర్భగుడిలో వేంచేసిన జీవేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బోడెమ్మ కోవెలలో ఉన్న జీవేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమైంది. ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. వేకువజాము నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకోవచ్చన్నారు. రాత్రి 9 గంటల నుంచి మహా రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు బుర్రా వెంకటరావు, తాలాడ రవీంద్ర, తంగుడు చంద్రశేఖర్, రాయితీ చంద్రశేఖర్, బస్వా రవి, చిత్రాల గాంధీ, లక్ష్మణ్, యాగాటి ప్రసాద్, గణగళ్ల కొర్లయ్య, అర్చకులు గంధం శ్రీనివాసరావు, వేంకటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకోవాలి



గార ఆర్ఎస్‌కేలో నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఏవో పద్మావతి

గార: రైతులకు డిజిటల్ గుర్తింపు సంఖ్య ఇచ్చే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిందని, రైతుసేవా కేంద్రాల్లో రైతులందరూ నమోదు చేసుకోవాలని ఏవో డి.పద్మావతి సూచించారు. మండలంలోని గొంటి, చల్లపేట, గార తదితర రైతుసేవా కేంద్రాల్లో ప్రత్యేక యాప్‌లో నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్ని రకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు, వీఆర్వో కిరణ్, వీఏఏ లావణ్య తదితరులు పాల్గొన్నారు.